క్లుప్తంగా

అయ్యప్పకు వెండి తొడుగులు బహూకరణ



రేపల్లె రూరల్: ఇసుకపల్లిలో వేంచేసియున్న అయ్యప్పస్వామికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశానుసారం ఆయన సోదరుడు అనగాని శివప్రసాద్ వెండి తొడుగులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మోదుకూరులో 'పొలం పిలుస్తోంది'



చుండూరు(వేమూరు): వరి పైరులో చీడ పీడలు తక్కువగా అన్నాయని, అనవసరంగా పురుగు మందులు పిచికారీ చేయవద్దని బాపట్ల సహాయ సంచాలకులు ఎ.లక్ష్మి రైతులకు సూచించారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు వరిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. రబీకు సంబంధించిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు. రబీ పంట సాగు చేసే రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలని ఆమె తెలిపారు. ప్రతి రైతు తమ పొలాలల్లో ఏఏ పంటలు సాగు చేస్తున్నారు.. మీ రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. వాతావరణ శాఖ సూచనల మేరకు పంట కోతలు కోసుకోవాలన్నారు. గోపి, షాలేం రాజు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన



భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ వి.జ్యోతిబసు భట్టిప్రోలు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను భద్రపరచిన గదిని తనిఖీ చేసి, వాటిపై క్షుణంగా ఆరా తీశారు. పంచాయతీలో జరిగిన కార్యకలాపాలను గూర్చి నివేదికలను పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు. ఆయన వెంట డీఎల్‌పీఓ నరసింహారావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

వేమూరు: కాల్వల్లో చేపలు పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన మామూళ్ల విషయమై ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసింది. పోలీసుల కథనం మేరకు ఈ నెల 2వ తేదీన గొరికపూడి చినరత్నం, ముగ్గురు మహిళలు కలిసి గొరికపూడి మనోజ్‌పై మామూళ్ల విషయమై దాడి చేశారు. మనోజ్‌ను 108 వాహనం ద్వారా తెనాలి జిల్లా వైద్యాశాలకు తరలించారు.వైద్య శాలలో అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసుకుని వేమూరు పోలీసు స్టేషనుకు బదిలీ చేశారని ఎస్‌ఐ రవి కృష్ణ తెలిపారు. ఈక్రమంలో శుక్రవారం కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మోదుకూరు చుండూరు స్టేషన్‌ల మధ్య పట్టాల వెంబడి ప్రయాణికుడు కొన ఊపిరితో ఉండడాన్ని కీ మ్యాన్ గమనించి 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యశాల సమీపంలో వాహనంలోనే మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని 108 సిబ్బంది వైద్యశాల మార్చురీకి అప్పగించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడి జేబులో ఉన్న కాగితంపై రాసి ఉన్న సెల్ ఆధారంగా అతనిది అస్సాం ప్రాంతం అయి ఉంటుందని భావిస్తున్నారు.

17న షుగరు, గుండెజబ్బులపై ఉచిత వైద్యశిబిరం

తెనాలి: ప్రపంచ షుగరు వ్యాధి వారోత్సవాల సందర్భంగా స్థానిక గంగానమ్మపేటలోని కృష్ణ మెడికేర్‌లో ఈనెల 17వ తేదీన షుగరువ్యాధి, గుండెజబ్బులపై అవగాహన, ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయే కార్యక్రమంలో ఉచితంగా షుగర్ పరీక్షలు, ఆరికాళ్లు, నరాల స్పర్శకు చెందిన పరీక్షలను వైబ్రోమీటర్‌తో చేస్తామని ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ ఎస్‌పీ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

గ్రామీణ క్రీడామణులు

- ప్రోత్సాహమే క్రీడా వికాసానికి దోహదం
- జాతీయస్థాయి క్రీడల్లో ఐలవరం విద్యార్థులు
- ఎస్‌జీఎఫ్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులు
- నిరంతర శిక్షణ.. పీడీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణ



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

భట్టిప్రోలు: పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు. స్వయం కృషితో ప్రతిభావంతులైన క్రీడాకారులుగా ఎదుగుతున్నారు. పట్టుదలతో సాధన చేసి ఉన్నత శిఖరాల అదిరోహణ దిశగా సాగుతున్నారు. గురువు ప్రోత్సాహంతో వివిధ క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్నారు. చిన్న నాటి నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆటల పోటీల్లో మండల, నియోజకవర్గం, జిల్లా దాటుకుని జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యేలా ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారు. ఈయన జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. కబడ్డీ, యోగా, షూటింగ్ బాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, త్రో బాల్, చెస్ తదితర విభాగాల్లో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ఈ పాఠశాల నుంచి 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో రాష్ట్ర స్థాయి పోటీల్లో 11 మంది ప్రతిభ చాటగా...జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఇద్దరు, యోగాలో ఒకరు ఎంపికయ్యారు.

ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు

గతేడాది ఎస్వీ యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో శ్రీనివాసరెడ్డి బాపట్ల జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. 55 ప్లస్ విభాగంలో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో గోల్డ్ మెడల్, హై జంప్‌లో రజత పతకం సాధించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు.



మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలతో సత్తా చాటిన పీడీ శ్రీనివాసరెడ్డి (మధ్యలో)

జాతీయ జట్టుకు ఎంపికే లక్ష్యం



షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొని, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడానికి మా పీడీ సారు ఎంతో సాధన చేయించారు. ఆయన నిరంతరం మా వెన్నంటే ఉండి వెన్ను తట్టి ప్రోత్సహించారు. కఠోర సాధన చేశాం. ఒలింపిక్స్‌లో దేశం కోసం ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

–కె.అనిల్‌కుమార్, 10వ తరగతి

కఠోర సాధన చేస్తాం



మా పీడీ మాస్టారు ఆట పోటీల్లో ప్రోత్సహిస్తారు. రోజూ మైదానంలో 2 నుంచి 3 గంటల పాటు కఠోర సాధన చేస్తాం. అండర్–14 కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

–వి.చైతన్య కుమార్, 8వ తరగతి

ఐలవరం పేరు నిలబెడతా..



మా పీడీ మాస్టారు యోగా పోటీలకు నిత్యం సాధన చేయిస్తారు. ఆయన చెప్పిన మెళకువలు, ఎప్పటికప్పుడు ప్రతిభను మరింత పెంచుకుని సత్తా చాటాలని కృషి చేస్తున్నాను. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

–కె.సంపత్, 8వ తరగతి

సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి



రేపల్లె రూరల్: దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ ఎం.శోభారాణి చెప్పారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండలస్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పంచాయతీ అధికారులు నిరంతరం తమ విధులను నిర్వర్తించటంతో పాటు గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకై పనిచేయాలన్నారు. వీధి దీపాలు, తాగు నీరు పంపిణీ వంటి వాటితో పాటు పంచాయతీ బడ్జెట్‌లు రూపొందించుకోవటం, వార్షిక పాలన నివేదికలు తయారు చేసుకోవం, నెలవారీ, త్రైమాసిక, ఆర్థిక గణాంకాలు తయారు చేయటంపై దృష్టిసారించాలన్నారు. అదేవిధంగా పంచాయతీలలో నిర్వహించే ప్రతి అంశాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని చెప్పారు. గ్రామస్తులు గాని, గ్రామ ప్రజా ప్రతినిధులుగాని అభివృద్ధికి తెలియజేసిన సూచనలను సైతం నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించే విధానంపై రీసోర్స్ పర్సన్‌లు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో మండలస్థాయి, పంచాయతీల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి వేడుకలు



రేపల్లెలో ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరి



ప్రత్యేక అలంకరణలో చెన్నమల్లేశ్వరస్వామి



రేపల్లె స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

రేపల్లె రూరల్: కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని పట్టణ, మండలంలోని పలు దేవాలయాలు శుక్రవారం భక్తులతో కిక్కిరిసాయి. పట్టణంలోని ఓల్ట్ టౌన్‌లో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరి సమేత ఉమామహేశ్వరస్వామి, గ్రామదేవత బూరుగులమ్మ ఆలయంలో, రైలుపేటలోని పార్వతీ సమేత స్వయం భూ రామలింగేశ్వర స్వామి, ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి, బేతపూడిలో చెన్నమల్లేశ్వర స్వామి తదితర శైవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం అనంతరం స్వామి వార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రైలుపేటలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో లక్షదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని మోర్తోట గ్రామంలో వేంచేసియున్న ముక్తేశ్వరస్వామి ఆలయంలో, అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయంలో, చోడాయపాలెంలోని చౌడేశ్వర స్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయ ఆవరణాల్లో కార్తిక దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో బదరీ కేదారేశ్వరస్వామి

కర్లపాలెం: కార్తిక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని శివాలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. యాజలి గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో, అగ్రహారంలోని గంగా గౌరీ సమేత శ్రీ బదరీ కేదారేశ్వర స్వామి ఆలయాలతో పాటు గణపవరం, పేరలి, పెదగొల్లపాలెం గ్రామాలలోని శివాలయాలకు శుక్రవారం భక్తుల పోటెత్తారు. కార్తికమాసం పవిత్ర కార్తిక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామునుంచే భక్తులు పుణ్యస్నానాలచరించి శివాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

18న సచివాలయాల వద్ద ధర్నా

కర్లపాలెం: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన అన్ని గ్రామ సచివాలయాల వద్ద సీపీఐ, ఏపీ వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) జిల్లా కార్యదర్శి జల్లి భాగ్య శ్రీధర్ పేర్కొన్నారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం శుక్రవారం కర్లపాలెంలో నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు గ్రామాలలో మూడు సెంట్ల పట్టణాలలో రెండు సెంట్ల గృహం నిర్మించుకునేందుకు రూ.5లక్షల నగదు, ఉచితంగా ఇటుక, సిమెంటు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన కోరారు. వ్యకాస నాయకులు, సీపీఐ నాయకులు సింహాద్రి శివయ్య, బిజిలీ బాబు, జిలానీ, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా అధ్యక్షుడు భాగ్య శ్రీధర్

పారిశుద్ధ్య కార్మికులకు బీసీజీ వ్యాక్సిన్

తెనాలిరూరల్: తెనాలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణ తొమ్మిదో పారిశుద్ధ్య డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు బీసీజీ వ్యాక్సిన్‌ను శుక్రవారం వేశారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ బీసీజీ టీకా క్షయ వ్యాధి నుంచి రక్షణ కలిగిస్తుందని చెప్పారు. తొమ్మిదో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్, సచివాలయం శానిటరీ సెక్రటరీ ఎ. జ్యోత్స్న, శానిటరీ మేస్త్రి రాజేష్, ఏఎన్ఎంలు ఎ. పుష్పకుమారి, ఎం. వాణి, ఆశా కార్యకర్త ఆర్. మల్లేశ్వరి, తెనాలి టీబీ సిబ్బంది దిలీప్, భార్గవి మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో చోరీ

కర్లపాలెం: మండల పరిధిలోని కొత్త నందాయపాలెం గ్రామంలో వేంచేసియున్న దుర్గామల్లేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు అమ్మవారి ఆలయం తాళాలు పగలకొట్టి ఉత్సవ విగ్రహానికి ఉన్న రెండు సవర్ల బంగారు మంగళసూత్రాలు దొంగిలించటంతో పాటు కానుకల హుండీని గ్రామం బయట పొలాల్లోకి తీసుకుని వెళ్లి పగలకొట్టి నగదు తీసుకుని పరారయ్యారు. శుక్రవారం ఉదయం ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లిన పూజారి కావూరి ప్రసాద్‌రెడ్డి ఆలయం తాళాలు పగలకొట్టి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా హుండీ కనిపించలేదు. అలాగే అమ్మవారి ఉత్సవ విగ్రహం మెడలోని మంగళసూత్రాలు దొంగిలించబడినట్లు గుర్తించి గ్రామపెద్దలకు తెలపగా.. వారు హుండీ కోసం వెతగ్గా పొలాల్లో పడవేసి ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఘటనపై ఆలయ పూజారి కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ ఎ.రవీంద్ర, క్లూస్ టీమ్స్‌ను పిలిపించి చోరీకి గురైన హుండీ మీద వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



హుండీపై వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ప్రజా సంక్షేమం కోసం కర్పూర హారతి

బాపట్లటౌన్: ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, తీరానికి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలని కార్తికపౌర్ణమి రోజున తీరంలో కర్పూర హారతి ఇచ్చామని పల్నాడు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం సూర్యలంక తీరంలో కర్పూర హారతి ఇచ్చారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ వేదపండితులు, బ్రాహ్మణ సమాఖ్య అర్చకుల సంయుక్త ఆధ్వర్యంలో వేదమంత్రాల సాక్షిగా కర్పూరసాగర హారతిను ఇచ్చామన్నారు. రాబోయే ఐదేళ్లల్లో సూర్యలంక తీరం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. తీరానికి వచ్చే భక్తుల సౌకర్యాలతోపాటు అధికసంఖ్యలో వచ్చే వాహనాలకు కూడా ఇబ్బంది లేకుండా చూసేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టామన్నారు. అనంతరం సతీసమేతంగా సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం తీరంలో పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని ప్రారంభించారు. బాపట్ల నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి నామన శ్రీమన్నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కర్పూర హారతి ఇస్తున్న మాచర్ల, బాపట్ల ఎమ్మెల్యేలు జూలకంటి, వేగేశన

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తెనాలిరూరల్: పట్టణంలోని ప్రతి వార్డుల్లో చేపడుతున్న పరిసరాల శుభ్రత, మురుగు నీరు పారుదల వంటి శానిటేషన్ పనులు విస్తృతం చేసిన పురపాలక సంఘం ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. పట్టణంలోని 11,12 వార్డుల్లోని ప్రతి వీధిలో శుక్రవారం పర్యటించిన చైర్‌పర్సన్, స్పెషల్ డ్రైవ్ పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి, పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్ కటారి రత్నకుమారి, కటారి హరీష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.



పుస్తక పఠనం అలవరుచుకోవాలి

నగరం: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవరుచుకోవాలని జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రొంపిచర్ల విజయసారథి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నగరం మండలం మంత్రిపాలెం గ్రామంలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడితో సమానమని చెప్పారు. గ్రంథాలయంలో పుస్తకాలు అనేకం ఉంటాయని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు జొన్న బ్రహ్మేంద్ర, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో పుస్తక ప్రదర్శన...

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని మాటూరు రామారావు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఇంగ్లిష్ గ్రామర్, కథలు, పురాణాలు, జాతీయ నాయకులు జీవిత చరిత్రలు, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, నవలలు, తదితర పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచారు. ఉపాధ్యాయులు అసీఫ్ అలీ మాదక ద్రవ్యాల నిరోధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు నీతి కథ చెప్పడం, గంథాలయాల ఉపయోగాలపై వకృత్వ పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం ప్రాముఖ్యతను గూర్చి గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ వివరించారు. ఈ పోటీలలో 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



భట్టిప్రోలు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

పుస్తక ప్రదర్శనను ఎంపీపీఎస్ (ఉర్దూ) హెచ్ఎం ఎండీ ఖలీలుల్లా, ఎంపీపీఎస్ (ఎంజీఎస్) హెచ్ఎం మహ్మద్ అల్తాఫ్ హుస్సేన్, షేక్ సుభాన్ ఖాన్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరులో...

అమర్తలూరు(వేమూరు): ఇంటూరు శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలో పలు గ్రామాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సుధీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే చరిత్ర తెలుస్తుంది

బాపట్లటౌన్: చరిత్ర తెలుసుకోవడం పుస్తకపఠనంతోనే సాధ్యమవుతుందని స్టేట్‌బ్యాంక్ మేనేజర్ ఎస్.ఎల్.శ్రీకాంత్ గుప్తా తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పూండ్ల శాఖాగ్రంథాలయంలో పుస్తకాల ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. మేనేజర్ ఎస్.ఎల్.శ్రీకాంత్‌గుప్తా మాట్లాడుతూ మనకు పూర్వం జరిగిన సంఘటనలు, స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల చరిత్ర, ప్రముఖ ప్రాంతాల గత చరిత్రలు, దేవాలయాల చరిత్రలు, సమాజంలో జరుగుతున్న మార్పులు, నాడు... నేడు మధ్య వ్యత్యాసం తెలుసుకోవడం ఒక పుస్తక పఠనం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పుస్తకాలను చదివి జ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రామపెద్దలు గంగిశెట్టి రత్తయ్య, దండమూడి కోటయ్య, అడపాల శ్రీరాములు, షేక్ చినబాషా పాల్గొన్నారు.



ఇంటూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



పూండ్ల శాఖా గ్రంథాలయంలో పుస్తకాల ఉపయోగాలు వివరిస్తున్న శ్రీకాంత్ గుప్తా

ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన డీపీటీఓ



తెనాలిరూరల్: తెనాలి ఆర్టీసీ డిపోను జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీఓ) కె. రవికాంత్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డిపోలోని గ్యారేజ్‌లో ఆయిల్ విభాగం, టైర్ల విభాగం, స్టోర్‌లను తనిఖీ చేశారు. గ్యారేజ్‌లో సిబ్బందితో సమావేశమై బస్సుల మరమ్మతుల విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. ట్రాఫిక్ విభాగంలో కంట్రోల్ పాయింట్, అర్నింగ్ సెక్షన్ ఇతర విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. శనివారం నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు సమయపాలన మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, అందుకు తగ్గట్టుగా సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లు ఐదు నిమిషాలకంటే ఎక్కువ సమయం ఆగకూడదన్నారు. అక్టోబర్ నెలలో డిపోలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్ వెంకటేశ్వరమ్మను సత్కరించి అభినందించారు. డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐజే ప్రసాదరావు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ అభిరామ్ నాయక్, అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.